క్లుప్తంగా

శివాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ఈటీసీ సెంటర్ వద్ద ఉన్న శివాలయానికి మున్సిపల్ పరిధి వీఎం పల్లెకు చెందిన పసల కుమారస్వామి నాలుగు గోపుర శిఖరాలకు రూ.22వేలు విరాళంగా అందజేశారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీస్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పంచాయతీకి రూ.62,11,106 ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సర్పంచ్ శివయ్య, పంచాయతీ అధికారులు

ఏర్పేడు: దుకాణాల వేలం ద్వారా ఏర్పేడు పంచాయతీకి రూ.62,11,106 ఆదాయం లభించింది. గురువారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ఆధ్వర్యంలో 24 దుకాణాలకు వేలం జరిగింది. పలువురు వ్యాపారస్తులు రూ.62,11,106కు దుకాణాలను దక్కించుకున్నారు. మరో 7 దుకాణాలకు త్వరలో వేలం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ రమణకుమార్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు మురగయ్య, సుబ్రమణ్యం, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

జంగం కులస్తులు ఏకం కావాలి



మాట్లాడుతున్న రామబ్రహ్మం

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జంగం కులస్తులు ఏకమై రాజకీయ గుర్తింపు, హక్కులు సాధించుకోవాల్సిన అవసరం ఉందని జంగం దేవర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామబ్రహ్మం తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జంగమ కులవృత్తికి ఆదరణ కరువైందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జంగం కులస్తులను చైతన్యపరచడానికి నియోజకవర్గాల కన్వీనర్లను ఎంపిక చేసినట్టు చెప్పారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్‌గా బాబ్జీ, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం సాంబశివరావు, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్‌గా వి.చంద్రశేఖర్‌ను నియమించినట్లు తెలిపారు.

స్టాటిస్టికల్ డేటా సైన్స్ భవనం ప్రారంభం రేపు

తిరుపతి కల్చరల్: నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్తు అందించాలనే సంకల్పంతో పద్మావతి మహిళా వర్సిటీ వద్ద ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టికల్ డేటా సైన్స్ సెంటర్ భవనాన్ని ఈ నెల 17న ప్రారంభిస్తున్నట్లు ఐఎస్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ సంస్థ ద్వారా టీటీడీలో సుదర్శనం టోకెన్లు, క్యూలైన్ల ప్రతిపాదన అమలుకు సహకారం అందించామన్నారు. కాలానికి అనుగుణంగా విద్యలో డేటా సైన్స్ అనివార్యమన్నారు. ఈ పరిస్థితుల్లో నూతన అప్లికేషన్స్‌ను నేర్పించాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ఆరంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ ద్వారా పీజీ డిప్లొమా, ఎమ్మెస్సీ, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు కూడా పైథాన్ ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ కోర్సులను అందుబాటులో ఉంచామని తెలిపారు. జూన్ నుంచి ఆరంభమయ్యే ఈ కోర్సులను ఆసక్తి గల విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

తిరుచానూరు(చంద్రగిరి): మహిళలు స్వశక్తితో ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, జిల్లా మేనేజర్ ఫర్జానా తెలిపారు. తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో గురువారం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద మహిళలకు టైలరింగ్‌పై ఇస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ మహిళలు స్వయం కృషితో ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలుచేస్తున్నాయని తెలిపారు. వాటిని దృష్టిలో పెట్టుకుని ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి లోకనాథం పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- మరోసారి జగనన్న సీఎం కావడం తథ్యం
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



గురవరాజుపల్లిలో సచివాలయ భవనం ప్రారంభంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం రేణిగుంట మండలంలో పలు ప్రభుత్వ భవనాలను ఆయన ప్రారంభించారు. గుత్తివారిపల్లెలో వైఎస్సార్ మహిళా భవన్, వెదుళ్లచెరువులో సీసీ రోడ్లకు భూమిపూజ, గురవరాజుపల్లె సచివాలయ నూతన భవనం ప్రారంభోత్సవం, కరకంబాడి సచివాలయం–2 పరిధిలో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఆయా సభల్లో ఆయన మాట్లాడుతూ ఎంత మంది కలిసి కుయుక్తులు పన్నినా, పేదలు జగనన్న పక్షానే ఉంటారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ మళ్లీ రాష్ట్ర ప్రజల దీవెనలతో మరోసారి జగనన్న ముఖ్య మంత్రి కావడం తథ్యమన్నారు. అన్ని వర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమైందని తెలిపారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు సామాన్య ప్రజలంతా వైఎస్సార్ సీపీకి స్టార్ క్యాంపైనర్లని అన్నారు. అధికార దాహం కోసం చంద్రబాబు అన్ని పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని, జగనన్న ప్రజల విశ్వాసాన్నే నమ్ముకుని ఒంటరిగా వారిని ఎదుర్కోనున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలని పేర్కొన్నారు. గురవరాజుపల్లె సచివాలయ ప్రారంభానంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ మండల



వెదుళ్లచెరువులో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

అధ్యక్షుడు గంగారి రమేష్, వైస్ ఎంపీపీ సుజాత, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, రహీం,



మహిళలకు చీరలు పంచుతున్న ఎమ్మెల్యే

గిరిరెడ్డి,రైతు సలహామండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, మన్నెం శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, ప్రభాకర్, సర్పంచ్‌లు డి.షైనాజ్‌బీ, మంజుల, శోభ, ఈశ్వరమ్మ, ఆవుల మునివెంకట్రామిరెడ్డి, మునిశేఖర్, నగేషం, ఎంపీటీసీలు భాస్కరయ్య, కన్నయ్య, కస్తూరి, రహంతుల్లా, కృష్ణమూర్తి, లత, చిన్నబాబు, నాగూర్, అబ్దుల్లా, సిద్దు, సాయిబాబు, రఫీ, నగరి కృష్ణ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మధు పర్యటన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు మండలంలోని అమ్మపాళెంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 10గంటలకు శ్రీకాళహస్తి నాలుగు మాడ వీధుల్లో లైటింగ్‌కు సంబంధించి బియ్యపు కృష్ణారెడ్డి మండపం వద్ద భూమిపూజ, 10.30 గంటలకు రాజీవ్‌నగర్‌లో శ్రీస్వామి అమ్మవార్ల విడిది మండపం ప్రారంభోత్సవం, 11 గంటలకు గిరిప్రదక్షిణ రోడ్డు, హరహరబావి వద్ద జీర్ణోద్ధరణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12గంటలకు శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరిలో సచివాలయం, ఆర్‌బీకే భవనం ప్రారంభోత్సవం, 12.30 గంటలకు చల్లపాళెం సచివాలయం, ఆర్‌బీకే భవనం ప్రారంభోత్సవం , 3గంటలకు ఇరిగేషన్ కార్యాలయం వద్ద చెక్‌డ్యామ్ పునరుద్ధరణ పనులకు భూమి పూజ చేయనున్నారు.

ఎస్టీయూ కార్యవర్గంలో ముగ్గురికి చోటు



ఆదిశేషయ్య, మల్లాం ముజీబ్, శ్యామ్ సుందర్

వరదయ్యపాళెం: రాష్ట్రోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా నూతన కార్యవర్గంలో వరదయ్యపాళెం మండలానికి చెందిన ముగ్గురికి చోటు లభించినట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చెంగయ్య, వెంపళ్ల చిన్నయ్య తెలిపారు. తిరుపతిలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షుడిగా వరదయ్యపాళెంకు చెందిన పృథ్వీ ఆదిశేషయ్య, జిల్లా మైనారిటీ కన్వీనర్‌గా మల్లాం ముజీబ్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడిగా శ్యామ్ సుందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వివరించారు.

ఈవీఎం గోదాములకు పటిష్ట భద్రత



గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రేణిగుంట: జిల్లాకు సంబంధించిన ఎన్నికల సామగ్రి ఈవీఎం యంత్రాలను భద్రపరచిన గోదాముల్లో నిరంతర పటిష్ట భద్రత యథావిధిగా కొనసాగించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. రేణిగుంట పాత ఎయిర్‌పోర్టు మార్గంలోని సీడబ్ల్యూసీ గోదాము ప్రాంగణంలో ఉన్న ఈవీఎం యంత్రాల గోదామును ఆయన గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి తనిఖీ చేశారు. గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎంలు, బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను సీసీ కెమెరాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బందోబస్తు 24/7 యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈవీఎం గోదాము ఇన్‌చార్జి కోదండరామిరెడ్డి ఇప్పటికే అడ్వాన్స్ టెస్టింగ్ ప్రొసీజర్(ఏటీఎస్) పూర్తయిందని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవీఎం గోదాము ఇన్‌చార్జి కోదండరామిరెడ్డి, ఎన్నికల సెల్ అధికారులు పవన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు మనోహరాచారి(టీడీపీ), వైఎస్సార్ సీపీకి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, చిరంజీవి (కాంగ్రెస్) పాల్గొన్నారు.

రామగిరిలో ఉపాధి సామాజిక తనిఖీ



రామగిరిలో ఉపాధి జాబ్ కార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌పీలు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో గురువారం ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం ఆడిట్ చేసింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ జోరుగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి సామాజిక తనిఖీ డీఆర్‌పీలు 2022, ఏప్రిల్ 1 నుంచి 2023, మార్చి 31 వరకు జరిగిన పనులకు సంబంధించిన రికార్డులు, పనులను తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి పనిని పరిశీలిం చడంతో పాటు పాల్గొన్న కూలీలకు సక్రమంగా నగదు అందాయా అని పరిశీలిస్తున్నారని, వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీని సైతం ఆడిట్ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ నాగభూషణమ్మ, జేఈ పుష్పరాజ్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ తిరుమలేష్, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

నష్టపరిహారానికి ఈ క్రాప్ తప్పనిసరి



అంజిమేడులో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఏర్పేడు: విపత్తులతో పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందాలంటే రైతులు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మండలంలోని నచ్చనేరి, నాగంపల్లి, అంజిమేడు గ్రామాల్లో గురువారం ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. పంటలపై రైతులకు తగు సలహాలు, సూచనలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు వేసిన పంటలు దెబ్బతింటే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. వరిధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేంతవరకు ప్రభుత్వ గోదాముల్లో దాచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ప్రసాద్‌రావు, శ్రీకాళహస్తి డివిజన్ ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏఓ షణ్ముగం, ఆర్ఐ సంతోష్, వీఏఏ భాగ్యలక్ష్మి, ఎంపీఈఓ సౌమ్య, ఏఈఓ ప్రదీప్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి

పుత్తూరు: ఏ పంటలకైనా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని ఆకాశవాణి తిరుపతి కేంద్రం కిసాన్ వాణి చీఫ్ కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం వడమాలపేటలో కిసాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 15న ఆకాశవాణి కిసాన్ దివస్ కార్యక్రమం ద్వారా రైతులకు శిక్షణ ఇస్తోందని తెలిపారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తిరుపతి హార్టీకల్చర్ శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి పంటను ఆశిస్తున్న తేనె మంచు పురుగు నివారణకు బుప్రోఫోజిన్, అసిఫేట్ 2 గ్రాములు, హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏరువాక కేంద్రం చిత్తూరు కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డిరాము యాజమాన్య పద్ధతులను వివరించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణారెడ్డి వరి, వేరుశనగ, నువ్వులు సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వడమాలపేట వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఆకాశవాణి సాంకేతిక సిబ్బంది బాలసుబ్రమణ్యం, దండపాణి, ఆర్‌బీకే ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి



అవార్డు అందుకున్న షారుక్‌ఖాన్

శ్రీకాళహస్తి: వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. గురువారం తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో వలంటీర్లకు అభినందన సభ జరిగింది. శ్రీకాళహస్తి జాలాజీనగర్ సచివాలయ వలంటీర్ జీవీ తులసికి సేవా వజ్ర, సిని మావీధి సచివాలయం–3 వలంటీర్ షారుఖ్‌ఖాన్‌కు ఉత్తమ బెస్ట్ మెనియల్ అవార్డు, పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా కమి షనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ వలంటీర్లను అభినందిస్తూ, మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

సంగీతాభ్యసనలో సాంకేతికత కీలకం

తిరుపతి కల్చరల్: సంగీతాభ్యసనలో సాంకేతికత ఎంతో కీలకంగా మారిందని, విద్యార్థులు దీన్ని అందిపుచ్చుకుని సాధన చేయాలని కర్ణాటకలోని రసరిషి అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ నందకుమార్ పిలుపునిచ్చారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో కళావైభవం పేరుతో చేపడుతున్న దక్షిణ భారత సంగీత, నృత్యోత్సవాలు గురువారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. సంగీత విద్యలో టెక్నాలజీ పాత్ర అనే అంశంపై రసరిషి అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ డాక్టర్ నందకుమార్ అధ్యక్షతన బృంద చర్చ నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ డాక్టర్ రాధ సారంగపాణి మాట్లాడుతూ సంగీత అధ్యయనంలో టెక్నాలజీ ఆవశ్యకతను వివరించారు. మహిళా వర్సిటీ చెందిన డాక్టర్ శైలేశ్వరి మాట్లాడుతూ సంగీత విద్యను అభ్యసించడంలో వివిధ సాంకేతిక పద్ధతులను ఉదాహరణలతో వివరించారు. జాతీయ సంస్కృత వర్సిటీకి చెందిన డాక్టర్ వైజర్సు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన స్వయంప్రభ ప్రాజెక్టు సంగీత విద్యను అభ్యసించడానికి ఏ విధంగా తోడ్పడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ముఖ్య గణాంకాధికారి, కళాశాల ప్రత్యేకాధికారి శేషశైలేంద్ర, డీఈవో ఎం.భాస్కర్‌రెడ్డి, ఫెడరల్ బ్యాంకు డెప్యూటీ ఉపాధ్యక్షురాలు స్వాతిప్రియ, చీఫ్ మేనేజర్ విజయభాస్కర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమా ముద్దుబాల, సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళ అవయవాల దానం



రామచంద్రాపురం: మండలంలోని కమ్మపల్లికి చెందిన హరిత (36) ప్రమాదానికి గురై బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆమె కుటుంబ సభ్యులు అవయవ దానం చేశారు. హరిత తిరుపతిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచరుగా పని చేస్తున్నారు. ఈ నెల 12న బైక్‌లో వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. ఆమెను స్విమ్స్‌లో చేర్పించారు. బుధవారం బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ చినబాబు, నీలకంఠ చౌదరి అక్కడికి చేరుకుని హరిత కుటుంబ సభ్యులను అవయవ దానానికి ఒప్పించారు. దీంతో హరిత కళ్లు, కిడ్నీలను వైద్యులు సేకరించారు. హరిత భర్త మురళీ మోహన్ ఏడాది క్రితం మృతి చెందారు. ఆమెకు పిల్లలు జీవన్ సాయి, భాషిత ఉన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



పాతవీరాపురంలో కరపత్రాలు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

- ఎన్నికల సీజన్‌లో వచ్చే నాయకులను నమ్మొద్దు
- సిద్ధం కార్యక్రమంలో బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. గురువారం సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాతవీరాపురం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని, ఆదిశగా ఎన్నో పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సభ్యుల రుణాలను నాలుగు విడతల్లో చెల్లించిన జగనన్నను మరోసారి సీఎంను చేసుకుని రుణం తీర్చుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే నాయకులను నమ్మొద్దని చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజుల, మోహనప్రియ, మునిరామయ్య, రాజేశ్వరి, పెంచలయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, పార్టీ మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, కార్యదర్శి సయ్యద్ కరీముల్లా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, దామోదరంరెడ్డి, లోకనాథరెడ్డి, రంగారెడ్డి, రామయ్య ఆచారి, గుణశేఖర్ నాయుడు, సురేఖ, గురునాధం, కేశవులురెడ్డి, రమేష్, రెడ్డెప్ప నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో రథసప్తమికి ఏర్పాట్లు



ఊరేగింపునకు సిద్ధం చేసిన వాహనాలు

- సప్త వాహనాలపై దర్శనమివ్వనున్న స్వామివారు
- ఉదయం 6 నుంచి వాహన సేవలు ప్రారంభం

నారాయణవనం: సూర్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు వాహనాలపై ఒక్కరోజు బ్రహ్మోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ వేకువ జామున 3 గంటలకు సుప్రభాత సేవతో ఆలయన్ని తెరచి నిత్యపూజా, గంట, నైవేద్య కార్యక్రమాలను పూర్తి చేసి 4 గంటలకు ఏకాంతంగా కల్యాణ వెంకన్న, పద్మావతీ అమ్మవార్లకు శుక్రవార అభిషేకాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై స్వామివారు గ్రామ వీధుల్లో విహరిస్తారని తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తి వరుసగా చిన్నశేష, పల్లకి, కల్పవృక్ష, పెద్దశేష, తిరుచ్చి వాహనాలపై మాడ వీధి ఉత్సవాల్లో భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. సాయంత్రం పూజల అనంతరం 6.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రథసప్తమి సందర్భంగా వాహనాలను ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధరభట్టాచార్య, భద్రతా జమేదార్ వెంకటరమణ పరిశీలించారు. మామిడి తోరణాలు, అరటి చెట్లను కట్టి ఆలయాన్ని అలంకరించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శ్రీఛాయాదేవి సమేత సూర్యనారాయణస్వామికి శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఉదయం 6గంటలకు కలశ స్థాపన, సంకల్పం చేసి అభిషేకం, ధూప, దీప నైవేద్యాలు సమర్పించనున్నారు. స్వామి అమ్మవార్ల రెండవ కాలాభిషేకం ముగిసిన తరువాత అలంకారమండపంలో ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి పూజలు చేస్తారు. ఉదయం 8గంటలకు స్వామివారు సూర్యప్రభపై, అమ్మవారు చప్పరంపై ఆశీనులై పురవీధుల్లో విహరించనున్నారు.

క్షత్రియ భవన నిర్మాణానికి భూమి పూజ



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న క్షత్రియ సేవా సంఘం నాయకులు

రేణిగుంట: రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలో గురువారం రూ.10కోట్ల అంచనాతో క్షత్రియ భవన నిర్మాణానికి రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం నాయకుడు గోకరాజు గంగరాజు భూమి పూజ చేశారు. అనంతరం ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతి పుణ్యక్షేత్రంలో రాష్ట్రస్థాయి క్షత్రియ సంక్షేమ భవనం అవసరమని భావించి స్థలాన్ని కొనుగోలు చేసి రూ.10కోట్ల వ్యయంతో నిర్మించాలని నిర్ణయించడం సంతోషకరంగా ఉందని అన్నారు. రాష్ట్ర క్షత్రియ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ బలరామరాజు, నారాయణ రాజు, మనోహర్‌రాజు, గిరిరాజు, అశోక్‌రాజు, శ్యామరాజు, సర్యనారాయణరాజు, రఘువర్మ తదితరులు పాల్గొన్నారు.

కళా వైభవం.. సంగీత, నృత్యోత్సవం



మోహిని అట్టంను ప్రదర్శిస్తున్న కేరళ కళాకారులు

తిరుపతి కల్చరల్: దక్షిణ భారత సంగీత, నృత్యోత్సవాల్లో భాగంగా రెండో రోజు మహతిలో కళాకారులు ప్రదర్శించిన సంగీత, నృత్యాభినయాలు కళా వైభవోత్సవాన్ని ఆవిష్కరించాయి. చెన్నై డాక్టర్ జె.జయలలిత మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు నాదస్వరం, వీణ, వయోలిన్, మృదంగం, కంజీరా వంటి వాయిద్యాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. కేరళ త్రిసూర్‌కు చెందిన కౌస్తుభం డ్యాన్స్ అకాడమీ కళాకారుల మోహిని అట్టం ఆకట్టుకుంది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల మృదంగ విభాగాధిపతి ఎం.సుధాకర్ శిష్య బృందం లయ విన్యాసం శ్రవణానందకరంగా సాగింది. కళాశాల గాత్ర విభాగాధిపతి శబరిగిరీష్ శిష్య బృందం, సాయి శివశ్రవణ్ బృందం, గాత్ర అధ్యాపకురాలు కొల్లూరి వందన శిష్యబృందం ప్రదర్శించిన గాత్ర కచేరి వీనుల విందుగా సాగింది. రసరిషి కేంద్రం, హంపీ కన్నడ వర్సిటీ విద్యార్థుల సంగీత గానామృతం మైమరపించింది. వి.సత్యనారాయణ, జి.లక్ష్మయ్య, పి.సుబ్రమణ్యం, పి.గోవిందశెట్టి, మునిరత్నంను సత్కరించారు.



కళాకారుల భక్త ప్రహ్లాద యక్షగాన నృత్యం